


కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు

రామారెడ్డి, జూలై 30: రామారెడ్డిలో గల కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి సిందూర పూజలు నిర్వహించారు. స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య భైరవునికి క్షీరాభిషేకం, సిందూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిదానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బుర్ర ప్రభురాంచంద్రం గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సురేందర్‌గుప్తా, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఆర్‌ఎస్‌కు.. మోక్షం లభించేనా?

- ఎల్‌ఆర్‌ఎస్ స్కీంపై ప్రభుత్వం దృష్టి
- పెండింగ్ దరఖాస్తుల క్లియరెన్స్‌కు సర్కార్ కసరత్తు
- పరిష్కారం కోసం జిల్లాకు ప్రత్యేక బృందం
- ప్రభుత్వ నిర్ణయంపై లబ్ధిదారుల్లో హర్షం
- జిల్లాలో 30వేలకు పైగా దరఖాస్తులు

కామారెడ్డి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనైన మోక్షం లభిస్తుందని దరఖాస్తుదారులు భావిస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ స్కీంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ పథకంలో మున్సిపాలిటీలోని పెండింగ్ దరఖాస్తులకు త్వరలోనే మోక్షం లభించనుంది. అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న అప్లికేషన్‌లను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. పెండింగ్ దరఖాస్తులతో పాటు కొత్తగా అప్లికేషన్‌లు పెట్టుకునేలా అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రతీ జిల్లాకు ఒక్క అధికారుల బృందాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయనుంది. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో సమావేశమై సమీక్షించారు. మున్సిపాలిటీలో సరిపోని సిబ్బంది లేకుంటే అవసరమైన ఇతర శాఖల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకోవాలని మంత్రులు సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంతో అటు దరఖాస్తుదారులకు మేలు జరగడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

జిల్లాలో 30వేలకు పైగా దరఖాస్తులు

2020లో ప్రారంభమైన ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వివిధ కారణాలతో నిలిచిపోయింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దరఖాస్తులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. అయితే జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో మొత్తం 30వేలకుపైగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో 10వేలకు పైగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు రాగా కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో 20 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులు పరిశీలించడానికి గతంలోనే సర్వే నెంబర్లు, స్థల విస్తీర్ణం ప్రకారం క్లస్టర్‌లుగా విభజించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, పట్టణ ప్రణాళికల విభాగాల అధికారులతో బృందాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తు దారులంతా ఆన్‌లైన్‌లో రూ.1000 చెల్లించారు. ఇళ్లు కట్టుకోవాలన్నా.. అమ్ముకోవాలన్నా ఇబ్బందులు పడుతున్న వారికి గత ప్రభుత్వం నిర్ణయంతో మేలు చేకూరే అవకాశం ఉంది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇప్పటికే లే అవుట్‌లేని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు గ్రీన్‌సిగ్నల్ సైతం ఇచ్చింది. జిల్లాలోని గ్రామ పంచాయతీ, మూడు మున్సి పాలిటీల్లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరిస్తే ప్రభుత్వానికి సుమారు రూ.60 కోట్లకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

2015లో మొదటి సారిగా

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల పరిధిలో అక్రమ లేఅవుట్‌లు పెరిగిపోతున్నాయని గుర్తించిన మున్సిపల్ శాఖ వాటిని క్రమబద్ధీకరించుకునే ఎల్‌ఆర్‌ఎస్‌ను తెరపైకి తెచ్చింది. రాష్ట్రం ఏర్పడ్డాక 2015లో మొదటిసారి గా అక్రమ లేఅవుట్‌లను ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా రెగ్యులరై జేషన్ అవకాశం కల్పించింది. అప్పట్లో పెద్దఎత్తున స్పందన లభించింది. 2015 నుంచి జిల్లాలో ఉన్న కామారెడ్డి మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తులు స్వీకరించారు. మొదట ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకునే వారితో రూ.10వేల చొప్పున బ్యాంకులో మున్సిపల్ కమిషనర్ పేరిట డీడీలు తీయించారు. ఆపై ఆయా భూముల విస్తీర్ణాన్ని బట్టి ఇంకా ఎన్ని వేల రూపాయలు చెల్లించాలో సిబ్బంది క్షేత్రస్థాయిలో ఆ భూమి పరిశీలించడం, కొలతలు, నలుదిశల ఉన్నవారి అభ్యంతరాలను పరిశీలించాక ఖరారు చేసి ఆ మిగిలిన మొత్తాన్ని తిరిగి డీడీల రూపంగా మున్సిపాలిటీకి చెల్లించాక ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులు ఇచ్చేవారు. ఈ విషయంలో కొందరు కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ ఆగిపోయింది. తిరిగి 2020లో కొత్త జీవోను తీసుకువచ్చారు. ఇందుకు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకునేవారు రూ.1000 డీడీ రూపంలో చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. పలు కారణాలతో అది కూడా జరగకపోవడంతో తెలంగాణ ప్రభుత్వం 2022 మరో జీవోను తీసుకువచ్చి క్రమబద్ధీకరణకు వెసులబాటు కల్పించింది. ఇలా ఏదో ఒక రూపేనా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రి య అభ్యంతరాలు రావడంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. అయినప్ప టికీ కదలిక లేకపోవడంతో తాజాగా కసరత్తులు చేసి అధికారులచే జిల్లాకు ఒక టీంను ఏర్పాటు చేసి దరఖాస్తుల పరిశీలన చేసి క్లియరెన్స్ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

మార్గదర్శకాలు లేక

గత ప్రభుత్వం ఆన్‌లైన్‌లో రూ.1000 ఫీజు చెల్లించి లేఅవుట్ లేని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు దరఖాస్తు చేసుకుంటే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్లాట్ల క్రయ విక్రయాలు జరుపుకోవచ్చని ఆదేశించింది. దీంతో సెల్‌ఫోన్ యాప్, మున్సిపల్ శాఖ వెబ్‌సైట్ ద్వారా వేలాది మంది ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అడపాదడప ఈ అంశమై ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో దరఖాస్తుల పరిశీలన చేపట్టిన అధికారులు చర్యలు తీసుకున్నా అందుకు సంబంధించిన మార్గదర్శకాలు సరిగా లేకపోవడంతో మున్సిపాలిటీల్లో ఇంతకాలం ముందుకు సాగలేదు. కానీ ఈ దరఖాస్తుల రూపేనా ప్రభుత్వానికి కాస్త ఆదాయం సమకూరింది. లే అవుట్‌లకు పరిశీలించకపోవడంతో ఆయా మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు 33 శాతం జరిమానా రూపేనా రావాల్సిన ఆదాయం రావడం లేదు. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌పై వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు తగిన సిబ్బందిని కేటాయిస్తే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు పరిష్కారం దొరకడంతో పాటు గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపాలిటీలకు భారీగా ఆదాయం సమకూరుతుందని మున్సిపల్, పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు.

రుణమాఫీతో ప్రతీ రైతుకు మేలు



రుణమాఫీ చెక్కును అందిస్తున్న కలెక్టర్

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూలై 30: రుణమాఫీతో ప్రతీ రైతుకు మేలు జరుగుతుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమా ఫీ మలి విడత నిధుల కార్యక్రమం మంగళవారం అట్టహాస ంగా ప్రారంభమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు రుణమాఫీ నిధులను విడుదల చేయగా కలెక్టరేట్‌లో రైతులతో కలిసి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వీక్షించారు. జిల్లాలోని 25 రైతు వేదికల్లోనూ రుణమాఫీ మలి విడత నిధుల విడుదల కార్యక్రమం కొనసాగగా, ఎక్కడికక్కడ రైతులు ఉత్సాహంగా పాల్గొని తమ హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ద్వారా రైతుల ఖాతాల్లో రూ.31వేల కోట్లు జమ చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతగా ఈనెల 18న లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేయగా, మలి విడతగా ప్రస్తుతం లక్షా 50వేల రూపాయల లోపు రుణాలను మాఫీ చేస్తూ నిధులు విడుదల చేసిందన్నారు. రుణమాఫీ ద్వారా జిల్లాలో మొదటి విడతలో 49,540 మంది రైతు కుటుంబాలకు రూ.231 కోట్ల మేర లబ్ధి చేకూర్చగా, మలి విడతలో 24,816 మంది రైతు కుటుంబాలకు రూ.211కోట్ల నిధులను వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ తెలిపారు. రైతాంగ ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రుణమాఫీ కార్యక్రమం జిల్లాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా జరిగేలా అధికార యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. అయినప్పటికీ ఎక్కడైన క్షేత్రస్థాయిలో రైతులకు రుణమాఫీ విషయంలో ఇబ్బందులు ఉంటే, వాటిని పరిష్కరించేం దుకు వీలుగా జిల్లా స్థాయిలో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఇప్పటికే తొలి విడత మాఫీకి సంబంధించి 1209 ఫిర్యాదులను పరిష్కరించాలని తెలిపారు. సహాయక కేంద్రాన్ని సంప్రదించేందుకు వీలుపడని రైతులు నేరుగా 7288894616, 7288894600 నెంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. రుణ మాఫీ ద్వారా అర్హులైన ప్రతీరైతు ప్రయోజనం పొందేలా బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు అన్నదాతలకు తోడ్పాటు ను అందించాలని ఆదేశించారు. ఏ ఒక్క రైతు అసౌకర్యానికి గురి కాకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన మలి విడత రుణమాఫీ నిధులను రెండు రోజుల్లోపు రైతుల ఖాతాల్లో అందుబాటులో ఉండేలా చూ డాలని, వారు తమ అవసరాల కోసం ఆ నిధులను వినియోగించుకునే విధంగా చొరవ చూపాలని బ్యాంకర్లకు సూచించారు. తొలి, మలి విడతలో రుణమాఫీ పొందిన రైతులందరికీ జిల్లా యంత్రాంగం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, జిల్లా వ్యవసాయాధికారి భాగ్య లక్ష్మీ, లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకు చర్యలు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి టౌన్, జూలై 30: పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద అడ్లూర్ చెరువు నీటిని వాడుకోవద్దని ఆ చెరువు కింద సాగు పనులు చేసే పలువురు గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. గత నాలుగైదు నెలలుగా కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అనేక వార్డుల ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధికి కావాల్సిన 10 ఎంఎల్‌డీ నీరు రావడంలేదని కేవలం 3 ఎంఎల్‌డీ నీటితో ప్రజల దాహార్తిని, ఇతర అవసరాలకు నీటిని అందించలేక పోతున్నామన్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా అడ్లూర్ చెరువు నీటిని కొద్దిమేర వినియోగించాలని ఆలోచన చేశామని తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టెక్రియాల్ ప్రాంతానికి 30 శాతం నీటి వాటా ఉందని ఆ నీటిని తాము వినియోగించుకునేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. త్వరలోనే ఈ నీటిని వినియోగించుకునేందుకు మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేపడుతామని జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. నీటి వాటాల విషయం తేలే వరకు ఎవరు నీటిని వినియోగించకుండా ఉండాలని కోరారు. రైతులంటే తనకు గౌరవం ఉందని కేవలం ప్రజల దాహార్తిని తీర్చేందుకే ఆలోచన చేశామని తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్‌లు పాత శివకృష్ణమూర్తి, ఇమ్రాన్, మమత, చాట్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ఏజెన్సీల రీ టెండర్‌పై కలెక్టర్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- నిబంధనలు పక్కాగా పాటించాలని ఉపాధి కల్పన అధికారికి ఆదేశం
- అవకతవకలకు పాల్పడుతున్న వాటిని ఎంపిక చేయవద్దని సూచన
- ఏజెన్సీల ఎంపికపై పూర్తిస్థాయి విచారణ జరపాలని బీవీఎం నాయకుల డిమాండ్

కామారెడ్డి టౌన్, జూలై 30: 'కార్మికుల జీతం కాంట్రాక్టర్‌ల జేబుల్లోకి' అనే కథనంపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. రీ టెండర్ ప్రక్రియలో నిబంధనలు పక్కాగా పాటించాలని ఉపాధి కల్పన అధికారిని ఆదేశించినట్లు సమాచారం. అవకతవకలకు పాల్పడుతున్న వాటిని ఎంపిక చేయవద్దని మరోమారు సరి చూసుకుని ఏజెన్సీల ఎంపికలను చేయాలని సూచించారని తెలిసింది. అయితే 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలు అక్షర సత్యాలని ఆయా విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు, సిబ్బందికి ఈఎస్‌ఐ, ఈపీఎఫ్‌లు ఏజెన్సీ నిర్వాహకులు చెల్లించడం లేదని సమగ్ర విచారణ జరపాలని బీవీఎం నాయకుడు విఠల్ కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించారు. పీఎఫ్, ఈఎస్‌ఐలు సరిగా చెల్లించకపోవడంతో కార్మికులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని అదేవిధంగా జీఎస్టీలను నిర్ణీత సమయంలో కట్టకుండా ప్రభుత్వ ఖజానాకు గండిపెడుతున్నారని అన్నారు. ఉద్యోగులను ఎంపిక చేసే సమయంలో అధికారులతో చేతులు కలిపి ఉద్యోగాలను అమ్ముకుంటున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయని, అసలు ఎక్కడా కూడా ఏజెన్సీల కార్యాలయాలు లేవని అన్నారు. జీఎస్టీలు కట్టని వారి వద్ద నుంచి ప్రభుత్వ డబ్బులను రికవరీ చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని లేకుంటే కార్మికు లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం జరిగేలా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు.

బంజారాల సంప్రదాయ పండుగ తీజ్



మొలకెత్తిన గోధుమ బుట్టలతో గిరిజన యువతులు

- పెళ్లి కాని అమ్మాయిలు ఘనంగా జరుపుకునే పండుగ
- తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో యువతుల నిర్వహణ

గాంధారి, జూలై 30: బంజారాల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ. పెళ్లి కాని యువతులు తొమ్మిది రోజుల పాటు నృత్యాలు ఆటపాటలతో జరుపుకుంటారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని.. పంటలు బాగా పండాలని.. వివాహానికి అనుమతులు ఉన్న రెండు కులాల మధ్య జరిగే తీయని అనుబంధాల కలయిక తీజ్ ఉత్సవం. అమ్మాయిలు, అబ్బాయిల విగ్రహాలను తయారు చేసి సంప్రదాయ రీతిలో ఆడుకోవడం ఆ వేడుక ప్రత్యేకత. గోధుమ నారు బుట్టలో ఎంత పచ్చగా పెరిగితే అంతా శుభం జరుగుతుందని లంబాడీల విశ్వాసం. జూలై నుంచి సెప్టెంబరు వరకు పలు ప్రాంతాల్లో కొనసాగిస్తారు. గిరిజనులు మాత్రం ప్రతీ ఏటా తీజ్ పండుగను నిర్వహిస్తూ ఆచారాలు, వేషధారణలు సంస్కృతి సంప్రదాయాలను బతికించుకుంటూ ఉండడం విశేషం. ప్రధాన పండుగలో భాగంగా ఒకరోజు ఉదయం యువతులు వేసిన పుట్టమట్టిని తెచ్చి ఎరువు కలుపుతారు. తండా పెద్దలతో బుట్టలో మట్టిని వేయించి గోధుమలను చల్లిస్తారు. చిన్నబుట్టలో యువతులు మట్టిని కలిపి గోధుమలు అలుకుతారు. తండా పెద్ద ఇంటి ఎదుట ప్రత్యేకంగా మట్టి వేసి యువతులంతా గోధుమ బుట్టులను అక్కడ పెడతారు. 9 రోజుల పాటు పెళ్లి కాని యువతులు రోజు మూడు సార్లు గోధుమలపై వాగులు, బావుల నుంచి నీళ్లు తెచ్చి పోస్తారు. ఈ రోజుల్లో వారు చక్కటి అన్నాన్ని తింటారు. ఏడు రోజుల్లో నీరు పోసిన తర్వాత ఎనిమిదోవ రోజు గంగూర్ చేస్తారు. తొమ్మిది రోజుల పాటు పోసిన నీళ్లతో గోధుమలు మొలకెత్తితే అంతా మంచే జరుగుతుందని గిరిజనుల ఆత్మ విశ్వాసం. యువతులు మంచి భర్త రావాలని సేవాలాల్ మహరాజ్, దండి, మేరామా యాడియాలను పూజిస్తు తీజ్ నిర్వహిస్తారు.

పండుగ నేపథ్యంలో..

గతంలో కలరా వ్యాధి వ్యాపించడంతో వందలాది మంది చనిపోయారు. తండా పెద్దలు సమావేశమై కుల దేవతలైన సేవాలాల్ మహరాజ్, దండి మీరా, అమ్మ ఏడియాలను కొలవడం ప్రారంభించడంతో వ్యాధి తగ్గుముఖం పట్టి యువతులకు పెళ్లి సంబంధాలు వచ్చాయి.

ప్రారంభం ఇలా..

పెళ్లి కాని యువతులు తండాకు చెందిన పెద్దమనుషుల వద్ద ఒక ఆదివారం వెళ్లి తీజ్ పండుగ జరుపుకోవాలని కోరుతారు. అదేరోజు తండావాసులు జెండా మేరమయాడి పండుగ విప్పే పండుగను నిర్వహిస్తారు. సోమవారం వేడుకలు ఉండవు, మంగళవారం సీత్లాభవాని బయటకు పంటలకు వెళతారు. అదేరోజు సాయంత్రం తండావాసులు సమావేశమై పెద్దమనుషుల ఆలోచన మేరకు తండాలో పెళ్లి కాని యువతుల సంఖ్యను బట్టి తీజ్ బుట్టలను నిర్ధారించి వివరాలు అందిస్తారు. అదేరోజు సాయంత్రం యువతులు గోధుమ గింజలను తీసుకువచ్చి నానా పెడతారు. సమీపంలో దొరికిన వెదురు పుల్లలతో బుట్టలను అల్లుతారు. ఏడవ రోజు ఉదయాన్నే శనగలు నాన బెడతారు. వాటిని సమీపంలోని రేగు చెట్ల ముళ్లకు గుచ్చి వస్తారు. ప్రతీ ఇంటి నుంచి బియ్యాన్ని సేకరించి పిండి రొట్టెలకు బెల్లం కలిపి చర్మ ప్రసాదం చేస్తారు. నెయ్యి కలిపి ముద్దలుగా చేసి తండానాయక్ ఇంటికి వెళ్లి ముద్దలను ఒకరినొకరు మార్చుకుని గోధుమ బుట్టల వద్ద పెడతారు. రాత్రంతా డప్పు వాయిద్యాలతో పాటలు పాడుతారు. ఎనిమిదో రోజు గంగోర్ లంబాడీలు మట్టితో తయారు చేసిన శివపార్వతుల ప్రతిమలను ఇరుపక్షాల వరుసైన పూజారులు ఇంట్లో ఉంచడమే తీజ్ పండుగ ప్రత్యేకత.



తండా నాయకుల ఇంటి ముందు ఉంచిన గోధుమ మొలకల బుట్టలు

పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ధ్వంసం

● గుమ్మిర్యాల్ వీడీసీ సభ్యులపై కేసు నమోదు



నాగేంద్రనగర్‌లోని పల్లె ప్రకృతి వనం

ఏర్గట్ల, జూలై 30: మండలంలోని నాగేంద్రనగర్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ధ్వంసం చేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే గత రెండు రోజుల క్రితం గుమ్మిర్యాల్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు నాగేంద్రనగర్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో రాత్రిల్లో ట్రాక్టర్‌తో మొక్కలు ధ్వంసం చేస్తున్నట్లుపై ఉన్నతాధికారులకు తెలపడంతో గుమ్మిర్యాల్ వీడీసీ సభ్యులపై పీడీపీపీ కింద కేసు నమోదు చేసినట్లు భీమ్‌గల్ సీఐనవీన్ తెలిపారు. పల్లె ప్రకృతి వనంలో దాదాపు 1600 మొక్కలు ధ్వంసం రూ.3లక్షల 50 వేల ఆస్తినష్టం జరినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు.

మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల తనిఖీ

రెంజల్,జూలై30: మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం ఆర్‌సీవో మహ్మద్ బషీర్ తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయుల బోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మైనారిటీ పాఠశాలలకు కోట్లాది రూపాయలను వెచ్చించి నాణ్యత ప్రమాణాలతో కూడిన చదువుతో పాటు భోజనం అందిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వంటగదిని సందర్శించారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ హర్షియా నాజీమ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ 63 నిర్మాణానికి రైతులు సహకరించాలి

● ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్

మోర్తాడ్, జూలై 30: పెర్కిట్ నుంచి మంచిర్యాల సెక్షన్ వరకు ఎన్‌హెచ్ 63 హైవే కోసం దోన్కల్, గాండ్లపేట్, మోర్తాడ్ బైపాస్ రోడ్డు నిర్మాణానికి రైతులు సహకరించాలని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. మంగళవారం మోర్తాడ్ మండల పరిషత్ కార్యాలయంలో మూడు గ్రామాల రైతులతో మాట్లాడారు. దోన్కల్, గాండ్లపేట్, మోర్తాడ్ గ్రామశివారులమీదుగా బైపాస్ రోడ్డు నిర్మాణం జరుతున్నదని దీనికోసం రైతుల నుంచి సేకరించిన భూములకు సంబందించి నష్టపరిహారం విషయాన్ని వివరించారు. రైతులు ఇచ్చిన విజ్ఞప్తులను ఆర్డీవో స్వీకరించారు. రైతులు భూకొలతలకు వ్యత్యాసం విషయంలో,సంబంధిత విషయాల్లో రైతుల విజ్ఞప్తులను తీసుకునాన్నరు. రోడ్డుకోసం సేకరించిన భూమిల్లో ఉన్న బోర్లు బావులు, పైప్‌లైన్‌లకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ సుజాత, సర్వేయర్‌లు, ఆర్ఐ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆర్మూర్ మున్సిపాలిటీ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

ఆర్మూర్ టౌన్ జూలై 30: పట్టనంలోని మున్సిపల్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాపాలన దరకాస్తులను, రిజిస్టర్‌లను పరిశీలించారు. దరకాస్తుల సవరణ, వారి సమస్యలను వివరంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆయన సూచించారు. ప్రజాపాలన దరఖాస్తుదారుల ఎడిట్ ఆప్షన్ అన్నింటికీ వచ్చేలా చేయాలని పలువురు కౌన్సిలర్‌లు ఆయన దృష్టికి తెచ్చారు.మున్సిపల్‌లో ఉన్న సమస్యలపై కమిషనర్ రాజును అడిగి తెలుసుకున్నారు.

తెలంగాణ యూనివర్సిటీ దక్షిణ ప్రాంగణంలో అట్టహాసంగా జాబ్ మేళా



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో సౌత్‌క్యాంపస్ అధ్యాపకులు

భిక్కనూరు, జూలై 30: భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో దోమకొండకు వెళ్లేదారిలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటుకు ముందు వరకు ఈ క్యాంపస్ ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో పీజీ సెంటర్‌గా కొనసాగేది. ఈ పీజీ సెంటర్‌లో విద్యను అభ్యసించిన చాలామంది ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. దాదాపుగా 60ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ క్యాంపస్ ప్రస్తుతం టీయూ సౌత్‌క్యాంపస్‌గా కొనసాగుతుండగా సువిశాలమైన తరగతి గదులు, అన్ని సౌకర్యాలు కలిగిన వసతీగృహాలు, గ్రంథాలయం ఉండగా గత 10సంవత్సరాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ప్రస్తుతం ఈ సౌత్‌క్యాంపస్‌కు చాలా డిమాండ్ ఉంది. కానీ ఇది వరకు ఓయూ ఆధ్వర్యంలో ఉన్నప్పుడు కానీ, టీయూ ఏర్పడ్డాక కానీ ఈ సౌత్‌క్యాంపస్‌లో ఎప్పుడు జాబ్ మేళాలు జరగలేదు. ప్రస్తుత వైస్‌చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌ల ఆదేశాల మేరకు టీయూట్రైనింగ్ అండ్‌ప్లేస్మెంట్‌సెల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియో ఇన్ఫర్మెటిక్స్ విభాగం సంయుక్తంగా హైదరాబాద్‌లోని క్రైనోస్ జియో స్పెషల్ టెక్నాలజీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జియోఇన్ఫర్మెటిక్స్ పూర్తిచేసిన ప్రస్తుతం అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రత్యేకంగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించగా విశేష స్పందన వచ్చింది.

● పెద్దఎత్తున పాల్గొన్న జియోఇన్ఫర్మెటిక్ విద్యార్థులు

మొట్టమొదటిసారిగా సౌత్‌క్యాంపస్‌లో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్మెంట్‌కు విశేషస్పందన వచ్చింది. జియోఇన్ఫర్మెటిక్స్ విద్యను పూర్తి చేసిన, ప్రస్తుతం అభ్యసిస్తున్న 35మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఈ జాబ్‌మేళాలో కంపెనీ ప్రతినిధులు రిజిస్టర్ చేసుకున్న 35మందికి వ్యక్తిగత పరిచయ రౌండ్, గ్రూప్ డిస్కషన్, ముఖాముఖీ, పరీక్షలలో ప్రతిభ ఆధారంగా 9మందిని ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురు కోర్సు పూర్తి అయినవారు ఉండగా, మిగితా వారు మొదటి, రెండవ సంవత్సరం అభ్యసిస్తున్న వారు ఉన్నారు. కాగా చాలామందికి ఈ విషయం తెలియక రిజిస్టర్ చేసుకోవడం వీలుకాలేదని, కొద్దిగా సమయం ఇస్తే మరింత ఎక్కువ మంది క్యాంపస్ ప్లేస్మెంట్‌కు రిజిస్టర్ చేసుకునే వారని విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

● క్యాంపస్ ప్లేస్మెంట్‌లో ఎంపికైన వారు వీరే

క్యాంపస్ ప్లేస్మెంట్‌కు 35మంది రిజిస్టర్ చేసుకోగా వారిలో తిరుమలేష్ (సెకండ్ ఇయర్),రాచూరిదివ్య(సెకండ్‌ఇయర్). గాజుల భార్గవ్ (సెకండ్ ఇయర్),సల్లూరిస్పందన(సెకండ్ ఇయర్), అనీల్‌కుమార్, భాస్కర్, యువకిరణ్, ప్రనూష, అనీత ఎంపికయ్యారు.వీరికి క్రైనోస్ జియో స్పెషల్ టెక్నాలజీ లిమిటెడ్ కంపెనీ సిబ్బంది నియామక పత్రాలను అందజేశారు.

● దక్షిణప్రాంగణంలో క్యాంపస్ ప్లేస్మెంట్ నిర్వహించడం మొదటిసారి

టీయూ సౌత్‌క్యాంపస్‌లో క్యాంపస్ ప్లేస్మెంట్ నిర్వహించడం ఇదే మొదటిసారి చాలా సంతోషంగా ఉంది. విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాల కల్పన అత్యంత ముఖ్యం.రానున్న రోజుల్లో సౌత్‌క్యాంపస్‌లో టీయూ ప్లేస్మెంట్ వారి సహకారంతో జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తా. సౌత్‌క్యాంపస్‌లో జాబ్‌మేళా నిర్వహించడానికి కృషిచేసిన రిజిస్టర్ యాదగిరి గారికి ధన్యవాదాలు.

● ఉద్యోగం రావడం అదృష్టంగా భావిస్తున్నాం : నక్క తిరుమలేష్

సెకండ్ ఇయర్ చదువుతన్న సమయంలోనే నాకు ఉద్యోగం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఇందుకు నేను చాలా కష్టపడ్డా. మా అధ్యాపకులు తమకు ఎంతో సహకరించారు. ఇదివరకు ఎన్‌ఆర్‌ఎస్‌సీలో ఒక ప్రాజెక్టు చేశాను. అది నాకు ఉపయోగపడింది. నాకు జాబ్ రావడానికి నన్ను అన్నివిధాలుగా సన్నద్ధం చేసిన గురువులకు కృతజ్ఞతలు.

● నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగింది : స్పందన


స్పందన

ఇంటర్న్‌షిప్‌లో భాగంగా దేశంలో ప్రతిష్టాత్మకమైన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో (ఎన్‌ఆర్‌ఎస్‌సీ)లో ప్రాజెక్టు చేశా. దీని వలన నాకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన కలిగింది. అందుకే ఈ జాబ్‌మేళాలో విజయవంతంగా అన్నిపరీక్షలను పూర్తి చేసి ఉద్యోగం సాధించా. ద్వితీయ సంవత్సరం చదువుతున్న నాకు ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది.

● ఉద్యోగం కోసం చాలా కష్టపడ్డా : కేతావత్ అనిల్


అనిల్

ఉద్యోగం కోసం చాలా కష్టపడ్డా, భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో జియో ఇన్ఫర్మెటిక్స్ పూర్తిచేశా. ఐఎన్‌సీఓఐఎస్‌లో ఇంటర్న్‌షిప్ పూర్తిచేశా. అనం తరం ఉద్యోగానికి ప్రిపేర్ అవుతుండగా సౌత్‌క్యాంపస్ అధ్యాపకులు తమకు సమాచారం అందించగా ప్లేస్మెంట్‌కు రిజిస్టర్ చేసుకున్నా. ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్, ఇతర పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసి ఉద్యోగానికి ఎంపికయ్యా. ఇందుకు నాకు సహకరించిన గురువులకు కృతజ్ఞతలు.

మోస్రా మండల పాఠశాలల్లో సమస్యలెన్నో..

● మరుగుదొడ్లు లేక ఉపాధ్యాయులు, విద్యార్థుల ఇక్కట్లు ● బురద మయంగా చింతకుంట పాఠశాల ● పట్టించుకోని సంబంధిత అధికారులు


మోస్రా పాఠశాల ఆవరణలో పందులు


పాఠశాల పక్కన మురికి కాలువ శుభ్రం చేయని దృశ్యం


ఎండిన చెట్టు గోడపై కూలేందుకు సిద్ధంగా ఉన్న దృశ్యం

మోస్రా,జూలై30: మండల కేంద్రంలో మండల ప్రజాపరిషత్ పాఠశాలలు మూడు ఉన్నాయి. ఒకటి బాపనయ్య నగర్, రెండో పాఠశాల వారసంత దగ్గర, మూడో పాఠశాల పిట్ల గంగాధర్ కాలనీలో కలవు. వారసంత వద్ద ఉన్న పాఠశాలలో ప్రధానంగా మరుగుదొడ్లు లేక ఉపాధ్యాయులకు పాఠశాల పిల్లలకు చాలా ఇబ్బంది అవుతుంది. నీళ్ల కొరకు బయట నుండి పైపు ద్వారా నీళ్లు నింపుకుంటూ కొనసాగిస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఎండిపోయి చెదలు పట్టిన చెట్టు వంగిపోయి పాఠశాల ఆవార గోడపై పడి ప్రమాదం జరిగేలా ఉంది. అనుకోకుండా జరిగే సంఘటన వల్ల గోడ కూలిన పిల్లలపై పడిన జరిగే నష్టం చెప్పలేము. పాఠశాల ఆవరణలో పిల్లలు ఆడుకునే స్థలంలో మట్టి కుప్పలు వేశారు. పిచ్చిమొక్కలు పెరిగి పాములు వస్తున్నాయి. మా పాఠశాలలో అటెండర్ లేనందున గ్రామ పంచాయతీ వారికి ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని వీళ్ల ఈ చెత్త అంత తీసేస్తే మేము మొక్కలు నాటుకోవడానికి మా పాఠశాల ఆవరణలో శుభ్రంగా చూసుకోవడానికి ఉంటుందని ప్రధానోపాధ్యాయురాలు శోభాబాయి తెలిపారు.

● పిట్ల గంగాధర్ కాలనీ పాఠశాలలో ఒకే మరుగుదొడ్డి

పిట్ల గంగాధర్ కాలనీ పాఠశాలలో ఒకటి మరుగుదొడ్డి ఉందని విద్యార్థులకు బాల, బాలికలకు ఇబ్బంది అవుతుందని ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు పాఠశాల వెనకే ఉన్న రెండు పడకల గదుల కాలనీ నుండి ఎక్కువ విద్యార్థులు వస్తున్నారు. ఐదే ప్రధానంగా పాఠశాల నుండి విద్యార్థులు ఇంటికి వెళ్లే దారి పూర్తిగా బురదమయం ముళ్లచెట్లతో అడవిని తలపిస్తుంది. పాఠశాల వెనుక ముందు డ్రైనేజీ లేని కారణంగా పాఠశాల చుట్టు మురికిగా ఉండి ముళ్ల పొదలతో నిండిపోయింది. పక్కనే ఉన్న కాలనీకి వెళ్లే విద్యార్థులు ఇక్కడ డ్రైనేజీ నిర్మాణం లేక కాలనీ చుట్టు తిరిగిఆ వెళ్తున్నారు. ఇక్కడ ఉన్న ఈ పరిస్థితి వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు భయంకరమైన రోగాల బారిన పడి అవకాశం ఉన్నది. పాఠశాలలోకి పందులు వస్తూ ఉన్నాయి. వాటి వల్ల మా పాఠశాల పరిస్థితి అగమ్య గోచారంగా మారిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి ఈ పాఠశాల సమస్యలు పరిష్కారం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● బురదమయంగా చింతకుంట జిల్లా పరిషత్ పాఠశాల

మండలంలోని చింతకుంట గ్రామంలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో వర్షం పడితే పాఠశాల ఆవరణలో అంత చిత్తడిగా బురదగా ఉంటుంది. ఎన్నోసార్లు విద్యార్థులు కాలు జారి పడిపోవడం జరిగింది. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి పాములు వస్తున్నాయి. విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అదే విధంగా నీటి కొరత ఉన్నదని బోర్ వేసి సమస్యలు పరిష్కారం చేసుకోగా బోర్ మోటార్ పాఠశాల యాజమాన్యంకు తెలియపరచకుండానే మోటార్ తీసుకెళ్లారు. బోర్ మోటార్ లేని బోర్ కేసింగ్ పైప్‌లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు వేసి మరో మోటార్ వేసుకోకుండా ఇబ్బందులు చేశారు. ప్రహరి గోడ లేక మా పాఠశాలలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇట్టి ప్రతి విషయాలు గ్రామ పెద్దలకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలిపిన పరిష్కారం చేయడం లేదని ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ తెలిపారు.

పాములతో భయంగా ఉంది

పాఠశాలలో పిచ్చి మొక్కలు పెరిగి పాములు తిరుగుతున్నాయి. మట్టికుప్ప, ఇటుకల కుప్పలో ఉండగా పిల్లలు బయటపడుతున్నాయి. ఎండిన చెట్టు వలన ఎప్పుడు ఎవరికి ఏమి జరుగుతుందో భయమేస్తుంది. సంబంధిత పంచాయతీ అధికారులు వెంటనే శుభ్రం చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

\- రాజు, పాఠశాల విద్యార్థి, మోస్రా

ప్రహరీ కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం

ప్రహరీ లేక లోపల అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఎవరో ఇక్కడే మద్యం తాగుతూ సీసాలు పడేస్తారు. సిగరేట్ ముక్కలు, రోజు ఇబ్బందిగా ఉండే విద్యార్థులకు, మాకు చాలా ఇబ్బందిగా ఉంది. కావున సంబంధిత గ్రామ కమిటీ, గ్రామ పంచాయతీ సభ్యులు ప్రహరీ నిర్మించి, పాఠశాలలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాను.

\- మధుసూధన్, హెచ్ఎం, చింతకుంట

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం


బోధన్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూలై30: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేయడం అభినందనీయమని మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా కాంగ్రెస్ పార్టీ, రైతుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ ఎన్నికలలో రైతులకు ఇచ్చిన రైతు రుణమాఫీ హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో రైతులను అభివృద్ధి చేయడానికి మరిన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇచ్చిన హామీ మేరకు దశాల వారిగా రెండు లక్షల రుణమాఫీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాషా మొయినోద్దీన్, నాగేశ్వర్ రావు, మందర్నా రవి, కౌన్సిలర్ శరత్ రెడ్డి, హరికాంత్ చారి, విష్ణువర్ధన్‌లతో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: రెండోవిడత రుణమాఫీ కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండోవిడత రుణమాఫీలో భాగంగా మంగళవారం రైతులకు ఒక లక్షా 50 వేల లోపు రుణమాఫీ జరిగినట్లు ఏఈవో శ్రావణి తెలిపారు.రుద్రూరు మండలంలోని రైతు వేదికలో రుణమాఫీ కార్యక మానికి రైతులు హాజరయ్యారు. అదే విధంగా రైతు బీమాకు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలకేంద్రంలోని రైతుభవనంలో మంగళవారం రెండవిడత రుణమాఫీ సందర్భంగా ముఖ్యమంత్రి విడియో ప్రసంగాన్ని బాల్కొండ నియోజికవర్గ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, రైతులు తిలకించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు, పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: ఇచ్చినహామీలను తూచాతప్పకుండా అమలు చేయడం ఒక్క కాంగ్రెస్ వల్లే సాధ్యమని,సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఒకొక్కటిగా హామీలను అమలుపరుస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ అన్నారు. ఆగస్టు 15 లోపు పూర్తిస్థాయి రుణమాఫీ జరుగుతుందన్నారు. రైతురాజ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేమన్నారు.ఈ సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షు డు పడిగెల ప్రవీన్ డీసీసీ కార్యదర్శి తక్కూరి దేవేందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్ల కొండ రాజేష్, బుచ్చిమల్లయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తే ఆందోళన వద్దు

ఏర్గట్ల, జూలై 30: సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడితే ఆందోళన చెందకుండా పోలీసులకు సమాచారం అందించాలని భీమ్‌గల్ సీఐ నవీన్ తెలిపారు. మంగళవారం మండలంలోని తడపాకల్ గ్రామంలో ఓ మహిళకు సైబర్ నేరగాళ్లు మీభర్త దుబాయ్‌లో మావద్ద ఉన్నాడని రూ. 50వేల నగదు ఇస్తే మీ భర్తను విడిచిపెడతామని ఫోన్ రావడంతో పోలీసులను ఆశ్రయించిందని, అది ఫేక్‌కాల్ అని తెలియడంతో వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. సైబర్ నేరస్థులు గానీ, పోలీసులు డీపి పెట్టుకొని గానీ ఎవరైనా ఫోన్ చేసి డబ్బులు అడిగితే పంపవద్దని, అనుకో కుండా డబ్బులు పంపిస్తే వెంటనే 1930కి కాల్ చేసి విషయం తెలపాలని సీఐ నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోతంగల్‌లో ఒకరి దారుణ హత్య

● కుటుంబ సభ్యులపైనే అనుమానం ● ఘటనా స్థలాన్ని పరిశీలించిన బోధన్ ఏసీపీ శ్రీనివాస్


లాలయ్య మృతదేహం, లాలయ్య (ఫైల్)


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న బోధన్ ఏసీపీ

కోటగిరి,జూలై30: పోతంగల్ మండల కేంద్రానికి చెందిన మేస్త్రీ లాలయ్య(55)అనే వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. లాలయ్యపై గుర్తు తెలియని వ్యక్తులు కర్రతో దాడి చేసి ముఖంపై బండరాయితో మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని బోదన్ ఏసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. వివరాల్లోకి వెళితే స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం మేస్త్రీ లాలయ్యకు ఇద్దరు భార్యలు, ఐదుగురు సంతానం ఉన్నారు. ఓ భార్య వీరికి దూరంగా ఉంటుంది. లాలయ్య గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేశాడు. గత కొంతకాలం క్రితం లాలయ్య పక్షవాతానికి గురై ఇంటి పట్టునే ఉంటున్నాడు.రెండో భార్య హన్మవ్వతో కలిసి ఉంటున్నాడు.భార్య, కూతుళ్ల ప్రవర్తనపై పలు అనుమానాలు ఉన్నాయి. లాలయ్య వారిపై తరుచు గొడవ పడే వాడని తెలిసింది. సోమవారం రాత్రి సైతం మరోమారు గొడవ జరిగినట్లు తెలిసింది.అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కర్రతో దాడి చేసి బండరాయిపై ముఖంపైమోదీదారుణంగా హత్యచేశారు.ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.ఘటన స్థలానికి బోదన్ ఏసీపీ శ్రీనివాస్‌తో పాటు రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి,ఎస్ఐ సందీప్‌లు చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్‌ను తీసుకువచ్చారు.ఘటనస్థలం నుంచి డాగ్‌స్క్వాడ్ తిరిగి అక్కడికే చేరుకుంది.కుటుంబ సభ్యుల ప్రవర్తనే హత్యకు దారి తీసినట్లుగాపోలీసులు భావిస్తున్నారు.మృతుడి భార్యహన్మవ్వను పోలీసులు అదుపులోకి తీసుకునివిచారిస్తున్నారు.మృతుడి సోదరుడు పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుఎస్ఐ సందీప్ తెలిపారు.మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియాఆసుపత్రికి తరలించారు.


డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీల దృశ్యం

బోధన్‌లో ఘనంగా బోనాల పండుగ

బోధన్‌రూరల్,జూలై30: బోధన్ పట్టణంలో మంగళవారం ఆరె కటికె సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి బోనం ఎత్తి అమ్మవారి ఆలయాల వరకు ఆరె కటికె సంఘం మహిళతో కలిసి బోనాలతో వెళ్లారు. మహలక్ష్మి, పెద్దమ్మ తల్లి ఆలయాలల్లో ఒడిబియ్యం నింపి, చీరసారెలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురువాలని, పాడిపంటలు చల్లగా ఉండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆరె కటికె ట్రస్ట్ చైర్మన్ గౌలికర్ నర్సింగ్ రావు, వికారాబాద్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జయ నర్సింగ రావు, బోధన్ డివిజన్ నాయకులు చౌదరి గంగారాం, రాజులాల్, మోహన్, మహేష్, రాజేందర్, రాజేశ్వర్, సాయినాథ్, గంగాలాల్, గోపి, రాఖీ, మహేష్, కుల సంఘం సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: తెలంగాణ ప్రజలు సంస్కృతిని ప్రతిబింబిస్తూ జరుపుకునే ప్రధాన పండుగలో బోనాల పండుగ ప్రత్యేకమైంది. రుద్రూరు మండల కేంద్రంలోని చిక్కడ్‌పల్లి గ్రామంలో మంగళవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భజా భజంత్రీలతో ప్రధాన వీధుల గుండా ర్యాలీగా వెళ్లి పోచమ్మకు భక్తి శ్రద్దలతో బోనాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు వృద్ధి చెందాలని గ్రామం బాగుండాలని, కుటుంబాలు చల్లగా ఉండాలని, పిల్లాపాపలు ఎటువంటి అనారోగ్యం బారిన పడకుండా కాపాడాలంటూ అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.


బోనం ఎత్తిన బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్

నల్లమడుగు నేల మత్తడికి బుంగ పూడ్చిన అధికారులు

లింగంపేట, జూలై 30: మండలంలోని నల్లమడుగు నేల మత్తడి బుంగను మంగళవారం నీటి పారుదల శాఖ అధికారులు పూడ్చి నీటి వృధాను అరికట్టారు. 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో వచ్చిన 'నల్లమడుగు నేల మత్తడికి బుంగ' అనే వార్తకు జిల్లా కలెక్టర్ స్పందించి నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించడంతో నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు వెళ్లి బుంగ పడిన ప్రదేశంలో ఇసుక సంచులు వేయించి వరద నీరు వృథాగా వాగులోకి వెళ్లకుండా ఆపినట్లు తెలిపారు. గతంలోనే మత్తడి మరమ్మతుకు రూ.2 లక్షలు మంజూరు చేసినా పనులు చేయడానికి ఎవరు ముందుకు రాకపోవడంతో పనులు పూర్తి చేయలేకపోయామని ఆయన తెలిపారు.



నల్లమడుగు నేల మత్తడి బుంగను పూడ్చుతున్న అధికారులు

నాగన్న బావికి కంచె నిర్మాణ పనుల ప్రారంభం

లింగంపేట, జూలై 30: మండల కేంద్రంలోని ప్రాచీన కట్టడం నాగన్న బావి స్థలం చుట్టూ కంచె నిర్మాణ పనులను మంగళవారం పీఆర్ డీఈఈ గిరి ప్రారంభించారు. బావికి కంచె నిర్మాణంతో పాటు దారి, హైమస్ లైట్లు ఏర్పాటు చేసి త్వరలోనే పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతామని ఆయన తెలిపారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

'బీసీలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్'

కామారెడ్డి టౌన్, జూలై 30: బీసీలను నమ్మించి కాంగ్రెస్ మోసం చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి బీసీల చేత ఓట్లు వేయించుకుని తీరా అధికారంలోకి వచ్చాక ఆ అంశాలను విస్మరిస్తుందని అన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన మొట్టమొదటి బడ్జెట్‌లోనే బీసీ సమాజాన్ని ఆదుకునే ఏ ఒక్క పథకం గాని ప్రత్యేక బడ్జెట్ గాని ప్రవేశపెట్టకపోవడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని తెలిపారు. వెంటనే బీసీలకు తగిన న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మదాసుస్వామి, జిల్లా అధ్యక్షుడు తోట బలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలని వినతి

పెద్ద కొడప్‌గల్, జూలై 30: జుక్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో గల ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ హిమబిందుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ జుక్కల్ మండలంలోని జుక్కల్, ఖండెబల్లూర్, కౌలాస్, పెద్దఏడ్గి గ్రామాల్లో గల ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని తెలిపారు. మంగళవారం కొంత మంది ఉపాధ్యాయులు పదోన్నతిపై వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారని, అయితే పూర్తిస్థాయిలో ఉపాధ్యాయల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. కొత్త డీఎస్సీ పూర్తయిన తర్వాత ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో పాఠశాలల్లో చేరుతారని విద్యాశాఖ అధికారులు అంటున్న అప్పటి వరకు విద్యార్థులకు నష్టం జరగదా అని ప్రశ్నించారు. ఆర్టికల్ 371-డిని జిల్లాలో అమలు చేసి ఖాళీ పోస్టులను వెబ్‌సైట్‌లో చూపితే జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు ఉపయోగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఫిర్దోస్, ఎస్ఎఫ్ఐ నాయ కులు జుబేర్, అక్షయ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి'

పెద్ద కొడప్‌గల్, జూలై 30: ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంపు ప్రక్రియ పూర్తయిన తర్వాతనే పంచాయతీ ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించాలని జుక్కల్ బీఆర్ఎస్ యూత్ ఇన్‌చార్జి శివకుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌లో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని ప్రకటించారన్నారు. దీంతో పాటు గానే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపు బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు పెంచితే తగిన ప్రాధాన్యత వస్తుందని తెలిపారు. ఇలా కాకుండా ప్రభుత్వం పాత రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు.

కూలిన ఇళ్లను పరిశీలించిన తహసీల్దార్

పెద్ద కొడప్‌గల్, జూలై 30: జుక్కల్ మండలంలోని కంఠాలి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన ఇళ్లను మంగళవారం మండల తహసీలార్ హిమబిందు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ శిథిలమవుతున్న ఇళ్లలో ప్రజలు ఎవరూ ఉండరాదని సూచించారు. గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు 6 ఇళ్లు కూలినట్లు తమ దృష్టికి వచ్చిందని, బాధితులంతా తమ రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం తీసుకుని తహసీల్ కార్యాలయానికి వస్తే బీపీఎల్ కింద ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్‌పటేల్, నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కంఠాలిలో కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

కనీస వేతనాలు అమలు చేయాలి

కామారెడ్డి టౌన్, జూలై 30: ఆశ, గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని సీఐటీయూ నాయకుడు చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం గ్రామ పంచాయతీ, ఆశ కార్మికులను ముందస్తు అక్రమ అరెస్టులపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 రోజులకు ముందుగానే రాష్ట్ర ప్రభుత్వ అనుమతితోనే గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ఆశ కార్మికుల పారితోషకాలు కాకుండా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చామని తెలిపారు. మంగళవారం నిరసనకు బయలుదేరి వెళ్తుండగా ఎక్కడికక్కడ కార్మికులకు వెళ్లకుండా బస్సులను తనిఖీ చేయడం, రైళ్లను తనిఖీ చేయడం, ప్రైవేట్ వెహికల్స్ వెళ్లకుండా నిర్బంధించడం, అరెస్ట్‌లకు పాల్పడడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడిన కార్మికులు బీఆర్ఎస్‌ను గద్దె దింపి కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కడితే అదే పద్ధతితో ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజనర్సు, సత్యం, శ్రీను, ఇందిరా, రాజశ్రీ, పద్మ, మంజుల, భాగ్య, సంధ్య, సంగీత, అనిత, కృష్ణవేణి, జయశ్రీ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లకుండా మంగళవారం ఉదయం దోమకొండ పోలీసులు గ్రామ పంచాయతీ కార్మికులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా నాయకులు నాగరపు ఎల్లయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు నిమ్మ నర్సింలు, కూర సంతోష్, నర్సింలు, శంకర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: తమ సమస్యల సాధన కోసం జుక్కల్ నియోజకవర్గంలోని పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్ గొండ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు గ్రామాల్లో వెట్టిచాకిరి చేస్తున్నా ప్రభుత్వం చాలీచాలని వేతనాలు ఇస్తుందని, ఆ వేతనాలు కూడా నెల నెల ఇవ్వకుండా ఆరు నెలలకోసారి ఇవ్వడం వల్ల పంచాయతీ కార్మికులు అవస్థలు పడుతున్నారని గుర్తు చేశారు. సమస్యలు పరిష్కారం కోరుతూ జుక్కల్ నియోజక వర్గం నుంచి ఆశ కార్యకర్తలు హైదరాబాద్ తరలివెళ్లారు. ఆశలకు రూ.18వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు చంద్రశేఖర్

బాన్సువాడ టౌన్: అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జె. రవీందర్ ప్రభుత్వంపై మండిపడ్డారు. మంగళవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి తరలి వెళుతున్న తనను, ఆశా వర్కర్లను పోలీసులు ఇళ్లలో నుంచి తీసుకవచ్చి అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బుజ్జిగారి సాయిలు, పల్లవి, లావణ్య, సుమలత, కవిత, వరలక్ష్మీ, సక్కుబాయి తదితరులున్నారు.

ఘనంగా బోనాల పండుగ

బాన్సువాడ, జూలై 30: బాన్సువాడ పట్టణంలోని కటికె సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్‌లు పాల్గొని నెత్తిన బోనమెత్తారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రజలందరూ సుఖఃశాంతులతో, పాడి పంటలతో జీవించేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే మహిళలు బోనాలను తలపై పెట్టుకుని భజాభజంత్రీల మధ్య ఆట, పాటలు, నృత్యాలు చేస్తూ గ్రామ దేవతల వద్దకు చేరుకున్నారు. గ్రామ దేవతలను అభిషేకించి బోనాలను, నైవేద్యాలు సమర్పించారు. అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని, పిల్లా పాపలతో అందరూ ఆరోగ్యంగా ఉండేలా చల్లగా చూడాలంటూ ఆ గ్రామ దేవతలను స్మరిం చుకుంటూ బోనాల పండుగ అత్యంత వైభవంగా నిర్వహించారు. బోనాల పండుగలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో పరిశ్రమల చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు పాల్గొన్నారు. బోనాలు ఎత్తుకుని ఉత్సవాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేసేవాడే నిజమైన నాయకుడు

- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, జూలై 27: రాజకీయ నాయకుడు తన స్వార్థం కోసం కాకుండా ప్రజలకు మంచి చేసినపుడే నిజమైన నాయకుడు అనిపించుకుంటాడని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గంలో 184 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశామన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొంత సమయం పడుతుందని, అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు సంక్షేమాన్ని అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ బాన్సువాడకు టూరిస్టు నాయకులు వస్తుంటారు.. పోతుంటారన్నారు. మంగళవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్, దుద్దాల అంజిరెడ్డి నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

చెస్ బాక్సింగ్‌లో సత్తా చాటిన రుశాంక్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, జూలై 30: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జరిగిన 2వ ఆసియా చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్, ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ బాక్సింగ్ సబ్ జూనియర్స్‌లో పోచారం భాస్కర్‌రెడ్డి తనయుడు రుశాంక్‌రెడ్డి గోల్డ్ మెడల్ సాధించి తన సత్తా చాటాడు. ఖుదీరామ్ అనుశీలన్ కేంద్రంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రుశాంక్‌రెడ్డి , కేరళకు చెందిన క్రీడాకారునిపై విజయం సాధించి బంగారు పతకం సొంతం చేసుకున్నాడు. అదేవిధంగా తెలంగాణ నుంచి ప్రాతినిథ్యం వహించిన సీనియర్ మహిళా విభాగంలో కామారెడ్డి జిల్లా పిట్లంలకు చెందిన క్రీడాకారిణి తక్కెడపల్లి ప్రతిభ 5 గోల్డ్ మెడల్స్‌ను, సీనియర్ పురుషుల విభాగంలో తక్కెడపల్లి విజయరాఘవేంద్ర రెండు సిల్వర్ మెడల్స్‌ను సాధించారు.



మెడల్స్‌తో రుశాంక్ రెడ్డి

వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలి

పెద్ద కొడప్‌గల్, జూలై 30: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పంచాయతీ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఎంపీవో లక్ష్మీకాంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని బేగంపూర్ గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులు పర్యవేక్షించారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ అయినందున వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని అవి వ్యాపించకుండా పంచాయతీ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. మురికి కాలువలు తీయించడంతో పాటు కుళాయి నీళ్లు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టిక పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇందల్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో 'ఉపాధిహామీ'ని అమలు చేయాలి

బాన్సువాడ టౌన్, జూలై 30: మున్సిపాలిటీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబాస్ రాములు మాట్లాడుతూ ప్రతీ మున్సిపాలిటీ పరిధిలో ఉపాధిహామీ పథకం అమలుతో పాటు కూలీలకు డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో రమేశ్‌రాథోడ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ అధ్యక్షుడు శంకర్, కార్మికులు ఎల్లయ్య, సంగమేశ్వర్, బ్రహ్మం, ఎల్లవ్వ, యాదగిరి తదితరులున్నారు.

విద్యార్థులకు పరీక్షపై అవగాహన

బాన్సువాడ టౌన్, జూలై 30: మండలస్థాయి కాంప్లెక్స్‌లో భాగంగా మంగళవారం బాలుర ఉన్నత పాఠశాలలో మండల నోడల్ అధికారి విజయ్‌కుమార్ విద్యార్థులకు న్యాస్ 2024 పరీక్షపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు న్యాస్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

1873 మందికి రెండో విడత రైతు రుణమాఫీ

మద్నూర్, జూలై 30 : రెండో విడత రుణమాఫీలో భాగంగా ఉమ్మడి మద్నూర్ మండలంలో 1873 మంది రైతులకు రుణమాఫీ జరిగినట్లు వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. మద్నూర్ లింబూర్ రైతు వేదికలో రుణమాఫీ కార్యక్రమానికి రైతులు హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీని ప్రకటించగానే రైతులు ఖాతాల్లోకి 1,50,000 జమ చేయబడినట్లు ఏవో వెల్లడించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మండల అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కర్షకుల కోసం పేద సంక్షేమ పథకాలు ప్రకటించడంతో పాటు రైతు రుణమాఫీ చేయడం వల్ల ఎంతో మందికి లాభం చేకూరిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గడ్డం లక్ష్మణ్, నాయకులు సాయిలు, రామ్ కిషన్ రైతులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో 1687 మందికి ..

మాచారెడ్డి: మండలంలో 1687మంది రైతులకు రుణమాఫీ జరిగినట్లు మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ తెలిపారు. ప్రభుత్వం రెండో విడుతగా రూ.1లక్ష 50 వేల రుణమాఫీ చేసిందన్నారు. రుణమాఫీ కాని రైతులు ఎవరైన ఉంటే వ్యవసాయకార్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

బాన్సువాడలో భారీ వర్షం

బాన్సువాడ టౌన్, జూలై 30: బాన్సువాడ పట్టణంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వారం రోజుల పాటు ముసురు వర్షం కురియగా, రెండు రోజుల పాటు కాస్త నెమ్మదించింది. మళ్లీ భారీ వర్షం కురియడంతో ప్రజలు, అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

పెద్ద కొడప్‌గల్, జూలై 30: జుక్కల్ మండలంలోని ఖండెబల్లూర్, కౌలాస్ గ్రామాల్లో గల ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం అధికారులు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాన్స్‌వాడ డీఎల్‌పీవో నాగరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ సౌకర్యాలను విద్యార్థులు ఉపయోగించుకుని విద్యాపరంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించిన విషయాలు చక్కగా అర్థం చేసుకుని విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. కౌలాస్, ఖండెబల్లూర్ పాఠశాలల్లో సుమారు 526 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం సత్యనారాయణ, సీసీ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ లక్ష్యంతో ముందుకు సాగాలి

దోమకొండ, జూలై 30: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటివేషన్ సేషన్ కార్యక్రమం నిర్వహించారు. మోటివేషనల్ స్పీకర్ ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ రమేష్ చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. జీవితంలో ఎలాంటి కఠిన పరిస్థితులు ఎదురైన ఆత్మస్థైర్యం కోల్పోవద్దని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ స్వర్ణలత,అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ముగ్గురు దొంగల అరెస్టు

బీర్కూర్, జూలై 30: మండల కేంద్రంలో ముగ్గురు దొంగలను పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. సీఐ సత్యనారాయణగౌడ్ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. మే, జూన్ నెలలో బీర్కూర్, నసురుల్లాబాద్, కోటగిరి మండలాల్లో పొలాల వద్ద గల బోరు మోటార్లకు సంబంధించిన విద్యుత్ తీగలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ మేరకు ఆయా పోలీసుస్టేషన్లలో రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా బీర్కూర్‌కు చెందిన ఏడుకొండలు తాపీ మేస్త్రీ, గోపనపల్లి పాషా, లారీ డ్రైవర్, సంగెం గ్రామానికి చెందిన అరుణ్ అనే ముగ్గురు వ్యక్తులు విద్యుత్ తీగలను విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పోలీసుల విచారణలో ఎక్కడెక్కడ దొంగతనాలు చేశారో చెప్పి నేరాన్ని అంగీకరించారు. వారిపై కేసు నమోదు చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు. ఈ ముగ్గురు వ్యక్తులు దొంగిలించిన రాగి విద్యుత్ తీగలను కొనుగోలు చేసిన ఐదుగురు పాత ఇనుప సామాన్ యజమానులకు నోటీసులు జారీ చేసి వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై రాజశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రయదారుల అరెస్టు

భిక్కనూరు, జూలై 30: పక్కా సమాచారం మేరకు సినిమా స్టైల్‌లో గంటకు పైగా పోలీసులు మాటు వేసి గంజాయి క్రయ-విక్రయాలు జరుపుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్న సంఘటన భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో చోటు చేసుకుంది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సోనాల గ్రామానికి చెందిన సకర్‌వాల్ హరిసింగ్‌తో బీబీపేట మండలంలోని తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన బూరెగారి రోహిత్‌గౌడ్, యాడారం గ్రామానికి చెందిన వడ్ల వంశీకి చాలా రోజులుగా పరిచయం ఉండగా, వీరిమధ్య గంజాయి క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని బీటీఎస్ వద్ద వీరి ముగ్గురి మధ్య గంజాయి క్రయ-విక్రయం జరుగుతుందని వచ్చిన పక్కా సమాచారం మేరకు బీటీఎస్ వద్ద మాటువేసి గంజాయి విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా ముగ్గురిని పట్టుకుని వారి వద్ద నుంచి 145 గ్రాముల గంజాయిని, రెండు ద్విచక్ర వాహనాలను, మూడు సెల్‌ఫోన్లను పట్టుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో తెల్లవారు జామున జడ్జి ముందు హాజరు పరుచగా వారికి 14రోజుల జ్యూడిషల్ కస్టడీ విధించగా నిజామాబాద్ జైలుకు తరలించడం జరిగిందన్నారు.

ఇంకుడు గుంతలో పడి ఒకరి మృతి

మాచారెడ్డి, జూలై 30: పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామానికి చెందిన కొల్లాపూరం రాజు(35) మూర్ఛవ్యాధితో ఇంకుడు గుంతలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. ఆదివారం కొల్లాపురం రాజయ్య తన కొడుకు రాజుతో కలిసి తనకున్న గేదెలను మేత కోసం తీసుకుని గ్రామ శివారులోని గుడ్డెలు గుట్టకు వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత రాజు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం గేదెలను తీసుకుని తండ్రి ఇంటికి వచ్చేసరికి కొడుకు రాజు ఇంకా ఇంటికి రాలేదని కుటుంబీకులు తెలిపారు. దీంతో కుల పెద్దమనషులకు చెప్పి వారితో కలిసి గుట్టకు వెళ్లి పరిశీలించగా ఇంకుడు గుంతలో పడి మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యా ప్రమాణాల పెంపుపై ఉపాధ్యాయులకు శిక్షణ

భిక్కనూరు, జూలై 30: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యాప్రమాణాల పెంపుకై ఉపాధ్యాయులు నిర్వహించవల్సిన తరగతి బోధనపై, జాతీయ స్థాయిలో నవంబరులో జరిగే నేషనల్ అసెస్‌మెంట్ సర్వేపై, విద్యార్థులు అభ్యాసన సామర్థ్యాలు సాధించడానికి నిర్వహించవల్సిన వ్యూహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు సురేందర్, గోపికృష్ణ, బీనాదేవి, జయరాం, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రేఖ, మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి

భిక్కనూరు, జూలై 30: భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎంపీవో రాజ్ కిరణ్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల భిక్కనూరు ఎంపీడీవో సంతోష్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్టు చేయగా అప్పటి భిక్కనూరు ఎంపీవో ప్రవీణ్‌కుమార్ అధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొనసాగారు. కాగా ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న ప్రవీణ్ కుమార్ ఇటీవలే దోమకొండకు బదిలీపై వెళ్లగా భిక్కనూరు ఎంపీవోగా గాంధారి నుంచి బదిలీపై వచ్చిన రాజ్‌కిరణ్‌రెడ్డికి అధికారులు ఇన్‌చార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

మహ్మద్‌నగర్ తహసీల్దార్‌గా సవాయిసింగ్

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), జూలై 30: మహ్మద్‌నగర్ మండల తహసీల్దార్‌గా సవాయి సింగ్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. లోగడ పని చేసిన డిప్యూటీ తహసీల్దార్ క్రాంతి కుమార్ బిచ్కుందకు బదిలీ అయ్యారు. మహ్మద్‌నగర్ మండలం ఏర్పాటైన నుంచి డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న క్రాంతికుమార్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ నుంచి సవాయిసింగ్ మహ్మద్‌నగర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రజలు, మండల వాసుల సహాయ, సహకారాలతో ముందుకు సాగుతానన్నారు.

చెరువు నీటిని తరలిస్తే ఉద్యమిస్తాం

కామారెడ్డి టౌన్, జూలై 30: అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువు నీటిని 30 శాతం కామారెడ్డికి తరలిస్తామనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువు నీటి వినియోగదారుల రైతుసంఘం సభ్యులు అన్నారు. మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి స్థానిక సంస్థల కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు ఆయాకట్టు కింద 10 గ్రామాల ప్రజలు పంట సాగు చేసుకుంటూ బతుకుతున్నామని అన్నారు.ఇప్పటికే నిండిన పూడిక మట్టితో చివరి ఆయాకట్టువరకు నీరు అందడం లేదని అన్నారు. కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఇటీవల మున్సిపల్ అధికారులతో వచ్చి చెరువును పరిశిలించి 30శాతం నీటిని తరలిస్తామని ప్రకటించారని తెలిపారు. ఇక్కడి నుండి నీటిని తరలిస్తే పంటసాగుకు మరింత ఇబ్బందులు ఏర్పడుతాయని వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - ఓసీ
దర్శన్ - డెడ్‌పూల్
ప్రియా 70 - కల్కి
ప్రియా 35 - రాయన్

బాన్సువాడ

మహేశ్వరి - రాయన్
వెంకటేశ్వర - పురుషోత్తముడు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

